క్లుప్తంగా

రైతు ఆత్మహత్య



వెంకటేశ్వరరెడ్డికి నివాళులర్పిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: అప్పుల బాధతో రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రం త్రిపురాంతకంలో సోమవారం జరిగింది. పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. రైతు వెంకటేశ్వరరెడ్డి అప్పుల బాధతో మానసికంగా వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. ఇతనికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. వెంకటేశ్వరరెడ్డి వైఎస్సార్ సీపీ నాయకుడు కూడా కావడంతో సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ దగ్గుల గోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు మల్లికార్జున్, నక్కా చిన్నత్రిపురరెడ్డి నివాళులర్పించారు.

ప్రిన్సిపాల్‌కు ఎమ్మెల్యే అన్నా అభినందన



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి జేఎన్‌టీయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన సందర్భంగా సోమవారం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కిట్స్ కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణచైతన్య తదితరులు ఘనంగా సన్మానించారు. విద్యార్థుల సంక్షేమానికి కృషిచేస్తానని కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ ప్రభాకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమిపూజ



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎన్జీఓ హోమ్ ఆవరణలో ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సోమవారం ఉదయం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కౌన్సిలర్ సలీమ్, ఎన్జీఓ సంఘ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బి.శ్రీనివాస శాస్త్రి, వి శ్రీనివాస్, సంఘం నాయకులు రవికిరణ్, రమేష్, జనార్దన్ రెడ్డి, రమణారెడ్డి, శ్యామ్‌తదితరులుపాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: మండలంలోని తుమ్మెదలపాడు గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పిచ్చయ్య యాదవ్‌కు రాధాక్రిష్ణన్ అవార్డు

గిద్దలూరు రూరల్: మండలంలోని పాదలకుంటపల్లెలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్‌కు వైఎస్సార్ జిల్లా అంతర్జాతీయ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ వారు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందజేశారు. 20 ఏళ్ల నుంచి ఉపాధ్యాయుడిగా ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ప్రముఖులు అభినందించారు.

బాలచెన్నయ్యకు ఘన సన్మానం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఆవరణలో 67వ ఎల్ఐసీ జాతీయ వారోత్సవాల సందర్భంగా సోమవారం ఎల్ఐసీ ఏజెంట్ బాలచెన్నయ్యను ఎల్ఐసీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సంస్థకు బాలచెన్నయ్య చేస్తున్న సేవలను పలువురు కొనియాడారు.

తలెత్తుకు తిరిగేలా సంక్షేమ పాలన



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ, నాయకులు

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- సచివాలయాలు, ఆర్బీకేలు ప్రారంభం

కొనకనమిట్ల: కులమతాలు, రాజకీయాలు, అవినీతికి తావులేకుండా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తూ, వైఎస్సార్ సీపీ నాయకులు తలెత్తుకుని తిరిగే పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చినమనగుండం గ్రామంలో ఆయన మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ వడ్లమూడి మురళీమోహన్, ఎంపీటీసీ కొండ్రు వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులతో కలిసి నూతన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. వారికి స్థానిక నాయకులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు 1.36 లక్షల మందికి సచావాలయాల్లో ఉద్యోగాలు కల్పించిందని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన నినాదంతో ఒకే చోట సమస్యలు పరిష్కారమయ్యేలా సచివాలయ వ్యవస్థను రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస మూర్తి, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి, జేఈ మస్తాన్‌వలి, పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి, వైద్యాధికారి నరేంద్ర, సచివాలయ కార్యదర్శి నాగార్జునరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, సీసీకేఆర్ శ్రీను, స్థానిక పార్టీ నాయకులు వడ్లమూడి యోగయ్య, వడ్లమూడి బ్రహ్మారావు, టంగుటూరి వెంకటరావు, మర్రి వెంకటేశ్వర్లు, ఈర్ల దుర్గారావు, బిజ్జాల వెంకటేశ్వర్లు, బిలామ్, జాన్, కోలా కొండయ్య, జీవయ్య, ఏబు, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సచివాలయాల్లోనే అన్నీ సేవలు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: సచివాలయాల్లోనే అన్నీ సేవలు అందించాలని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని గుడిమెట్టలో రూ.43 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కార్యాలయాల చుట్టూ స్థానిక ప్రజలు తిరగకుండా గ్రామాల్లోనే అన్ని ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకోచ్చారన్నారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, గుడిమెట్ట, ఒద్దులవాగుపల్లె సర్పంచ్‌లు రెడ్డి కాశిరెడ్డి, అన్నపురెడ్డి వెంకట రంగారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ మదిరె చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో కె.కవితా చౌదరి, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ సుధాకర్

మార్కాపురం రూరల్: మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అవగాహన కల్పించాలని వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది డీఆర్‌డీఏ కోఆర్డినేటర్ సుధాకర్ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని కోరారు. సోమవారం పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలో ఉన్న డ్వాక్రా బజారులో మండలంలోని వీఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, డీపీఎంలు సుబ్బారావు, కృష్ణారావు మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా తీసుకునే రుణాలతో స్వయం ఉపాధిని కల్పించుకుని ఆర్థికాభివృద్ధి చెందేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. చిరు వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్న వారికి ప్రభుత్వం జగనన్న తోడు పథకం ద్వారా వడ్డీ లేకుండా రుణాలను బ్యాంకు ద్వారా అందించాలని కోరారు. స్వయం సహాయక సంఘాలకు ప్రతి వీఓ ఐదు యూనిట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రుణాల బకాయిలు నూరు శాతం రికవరీ చేయించాల్సిన బాధ్యత వీఏఏలదేనని స్పష్టం చేశారు. సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ సులోచన, ఏపీఎం రమేష్, ఎల్‌సీ నాగభూషణం, సీసీలు మనోకుమారి, అకౌంటెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్, నాయకులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు

దర్శి: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ కుమారుడు ప్రశాంత్‌పాల్, ఇవాన్‌షైనీ వివాహ వేడుకలకు సోమవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్, ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర, ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జే జాన్‌బాబు, బిషప్ బీ శాంసన్, బిషప్ క్లారన్‌శాస్త్రి, పాస్టర్ వై.ప్రభుదాసు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, ఇతర జిల్లా నాయకులు, అధికారులు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి ఆతిథ్యం స్వీకరించారు.

మంత్రి చొరవతో గుంతను పూడ్చిన అధికారులు



గుంతను పూడ్చిన అర్ అండ్ బీ అధికారులు

పెద్దారవీడు: ఇటీవల కురిసిన వర్షాలకు సుంకేసుల గ్రామం సమీపంలో రహదారికి అడ్డంగా కాలువలా పెద్ద గుంత పడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, సుంకేసుల సర్పంచ్ గుడ్డెపోగు రమేష్‌లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి ఫోన్‌లో ఆర్‌అండ్‌బి అధికారులను గుంతను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందించిన అధికారులు రాకపోకలకు అంతరాయం కలగకుండా రహదారికి అడ్డంగా ఏర్పడిన గుంతను మట్టితో పూడ్చారు. దీంతో కలనూతల, గుండంచర్ల, సుంకేసుల గ్రామాల ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపి సంతోషం వ్యక్తం చేశారు.

రాచర్లలో కుండపోత వర్షం



కొండపేట ఆంజనేయస్వామి ఆలయం వెనుక పొంగిన సగిలేరు వాగు



గంగంపల్లెలో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

రాచర్ల: మండలంలో సోమవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. 6 గంటల నుంచి మొదలైన చినుకులు పగలంతా భారీ వర్షంగా మారింది. భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. గుడిమెట్ట గ్రామ సమీపంలోని ఎర్రవాగు, అక్కపల్లె గ్రామ సమీపంలోని లోతు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దాదాపు ఒంటి గంట వరకూ గుడిమెట్ట టూ అనుమలవీడు, మేడంవారిపల్లె గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గంగంపల్లె, అనుమలవీడు, రాచర్ల, గౌతవరం, రామాపురం, గుడిమెట్ట గ్రామాల్లో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పొగాకు, పత్తి, కంది పంట పొలాల్లో భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ప్రాంతంలో రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపి లేని వర్షం కారణంగా మండలంలోని పలు వాగులు ఉప్పొంగాయి. నల్లమల నుంచి వచ్చే వర్షపు నీటి కారణంగా సగిలేరు వాగు, ఎనమలేరు, ఉప్పువాగులకు వర్షపు నీటితో జలకళగా మారింది. కొండపేట ఆంజనేయస్వామి ఆలయం వెనుకాల ఉన్న సగిలేరు వాగు ఉధృతంగా పారడంతో అవతలి వైపు ఉన్న జగనన్న కాలనీకి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వెంగళరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని గుండ్రెడ్డిచెరువు కట్ట తెగిపోవడంతో చెరువులోని నీరు పంట పొలాల మీదుగా వెళ్లి పంటలు నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. శనివారం అర్ధరాత్రి పడిన వర్షం 149.8 మిల్లీ మీటర్లుగా, సోమవారం 19.4 మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ మునవర్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రజలు ఒకింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామ సచివాలయ పరిధిలోని బ్రాహ్మణపల్లి, కాకర్లపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

9న జాతీయ లోక్ అదాలత్

మార్కాపురం: మార్కాపురంలోని కోర్టు ప్రాంగణంలో ఈనెల 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవా అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ఆరో అదనపు జడ్జి టి.రాజా వెంకటాద్రి సోమవారం తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన అన్నిరకాల క్రిమినల్, సివిల్, ఫ్యామిలీ, భరణం, గృహ హింస, బ్యాంకు చెక్ బౌన్స్, యాక్సిడెంట్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. బ్యాంక్, బీఎస్ఎన్ఎల్, పీఎల్‌సీ కేసులు కూడా రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చని, లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

98 డీఎస్సీ అభ్యర్థుల సమస్య సీఎం దృష్టికి తీసుకువెళ్తా

- జంకె వెంకటరెడ్డి



జంకెకు వినతిపత్రం ఇస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

మార్కాపురం: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఆయనను 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు కలిశారు. తమకు పోస్టింగులు వచ్చేలా చూడాలని వినతిపత్రం ఇవ్వగా సీఎం దృష్టికి తీసుకెళ్తానని జంకె చెప్పారు. కార్యక్రమంలో బొంతల రామప్రకాష్, ఎస్తేరమ్మ, సుదీప్‌రాజు, రమణ, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బారావు, ఏడుకొండలు, సందీప్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళకుంట ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం



నియామక పత్రం అందుకుంటున్న గుమ్మా పిచ్చమ్మ

తర్లుపాడు: మండలంలోని మంగళకుంట పంచాయితీకి సోమవారం నిర్వహించిన వైస్ సర్పంచ్ ఎన్నికలో గుమ్మా పిచ్చమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి సుబ్రమణ్యం, పంచాయితీ సెక్రటరీ శ్రీనివాసులు, సర్పంచ్ పి శారద, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. ఉప సర్పంచ్‌ను ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ఇందిరా హనుమారెడ్డి, వైస్ ఎంపీపీ కందుల సుజాత, గుమ్మా రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ప్రకాశాన్ని వెనుకబడిన జిల్లాగా ప్రకటించాలి

దొనకొండ: ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించి జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరుతూ ఈ నెల 10వ తేదీ దొనకొండ నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు కంకణాల ఆంజనేయులు తెలిపారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాండవ రంగారావు, మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూడు పంచాయతీల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నిక

బేస్తవారిపేట: మండలంలోని చెట్టిచర్ల, పెద్ద ఓబినేనిపల్లె, అక్కపల్లె పంచాయతీ ఉప సర్పంచ్‌ల ఎన్నికలను సోమవారం స్పెషలాఫీసర్స్ శ్రీనివాసనాయక్, చెన్నకేశవరెడ్డి, రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. చెట్టిచర్ల పంచాయతీలో ఉప సర్పంచ్‌గా ఐదో వార్డ్ మెంబర్ కందుల లక్ష్మీదేవి, పెద్ద ఓబినేనిపల్లెలో మూడో వార్డ్ మెంబర్ బండ్లమూడి కాశయ్య, అక్కపల్లెలో ఆరో వార్డ్ మెంబర్ జంగం కేశవరెడ్డిలను ఎన్నుకున్నారు. స్పెషలాఫీసర్స్ నిమాయకపత్రాలను ఎన్నికైన ఉప సర్పంచ్‌లకు అందజేశారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

మార్కాపురం టౌన్: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రీజినల్ చైర్మన్ సురేంద్ర ఆధ్వర్యంలో స్థానిక స్ఫూర్తి మానసిక వికలాంగులకు అల్పాహారం, పలకలు, నోట్ పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ శ్రీదేవి, కార్యదర్శి ఆదిలక్ష్మి, రీజినల్ సెక్రటరీ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి వృద్ధురాలు

గిద్దలూరు రూరల్: స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన నారమ్మ అనే వృద్ధురాలు రెండు రోజుల నుంచి ఉండటం గమనించిన రైల్వే సిబ్బంది ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డికి సమాచారం అందించారు. ఆయన వైఎస్సార్ జిల్లా పులివెందులలోని అనాథాశ్రమం నిర్వాహకులు జనార్దన్‌రెడ్డికి సమాచారం అందించి ఆమెను ఆశ్రమానికి పంపించే ఏర్పాట్లు చేశారు. ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు అల్తాఫ్, శేషయ్య ఉన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

ముండ్లమూరు: ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని సీపీఎం రాష్ట్ర నాయకుడు జాలా అంజయ్య విమర్శించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనకు పురస్కారం



ఎం.బాలరాజు



ఎస్కే మహ్మద్ రఫీ



కె.సుధారాణి



పి.కోటి మోహన్



బీవీ రమణారెడ్డి

తర్లుపాడు: విద్యా రంగంలో విశేష సేవలందించినందుకుగాను ఏటా సెప్టెంబర్ 5న అందజేసే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు తర్లుపాడు మండలం నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయం సోమవారం పేర్లు ప్రకటించింది. మండలంలోని రాగసముద్రం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఎం.బాలరాజు, కేతగుడిపి ఎంపీపీఎస్ హెచ్‌ఎం ఎస్‌కే మహమ్మద్ రఫీ, ఫత్తేపురం ఎంపీపీఎస్ హెచ్‌ఎం కె.సంధ్యారాణి, చెన్నారెడ్డిపల్లిలో జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ పి.కోటిమోహన్, చెరువుకిందపల్లి ఎంపీపీఎస్ హెచ్‌ఎం బాసు వెంకట రమణారెడ్డిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. కాగా మండల స్థాయిలో 16 మందికి మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేస్తున్నట్లు ఎంఈఓ డి.సుజాత తెలిపారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు మంగళవారం ఒంగోలులో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందజేయనున్నారు.

నాగార్పమ్మ తల్లికి జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు



రజానగరంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు స్వాగతం పలుకుతున్న మహిళలు



పూజలు చేస్తున్న మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ, జెడ్పీటీసీ మారం

తాళ్లూరు (ముండ్లమూరు): తాళ్లూరు మండలంలోని రజానగరంలో నాగార్పమ్మతల్లి నెల పొంగళ్ల కార్యక్రమంలో సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వలి, నాయకులు పులి వికాస్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మద్దిశెట్టి రవీంద్ర పూజలు...

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర నాగార్పమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల పొంగళ్ల కార్యక్రమంలో భాగంగా ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, సర్పంచ్ వలి, ఎంపీటీసీ మేడగం వెంకటరామిరెడ్డి, నాయకులు పులి వీరాస్వామి, మేడగం శ్రీనివాసరెడ్డి, ఉప్పుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు సన్మానం

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి ఏ గీతేంద్ర మేలుకో ప్రకాశం నియోజకవర్గ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానం సాధించి రూ.పది వేల నగదు, జ్ఞాపిక, మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన బి.కీర్తన రూ.వెయ్యి నగదు, జ్ఞాపిక అందుకున్నారు. ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు విజేతలైన విద్యార్థులను సోమవారం సన్మానించారు. వారికి కో ఆర్డినేటర్ రంగసాయిరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

ఇద్దరికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

కంభం: మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. తురిమెళ్ల ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న కె.ప్రభాకర్‌రెడ్డి, స్థానిక పార్కువీధి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న షేక్ రహమత్‌లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరు మంగళవారం అవార్డు అందుకోనున్నారు.